

సవాళ్లను ఎదుర్కొంటూ భారత్ అభివృద్ధి
- ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలి
- బెల్జియం మాజీ ప్రధాని వైవెస్ లెటెర్మీ
- కోహిర్ పరిధిలోని వోక్సెన్ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు హాజరు





న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న హన్మంతరావు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు

సంగారెడ్డి క్రైం, జనవరి 9: మహిళలు తమ హక్కులను కాపాడుకునేందుకు గృహ హింస, బాల్య వివాహ నిషేధచట్టం, పోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హన్మంతరావు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో మంగళవారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉపాధి శిక్షణా సంస్థ అందిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాలను ఉపయోగించుకొని ఆర్థికంగా ఉన్నతంగా ఎదగాలని, ఎవరిపైనా ఆధారపడకుండా స్వయం సమృద్ధిగా ఉండాలని సూచించారు. మహిళలకు న్యాయపరమైన విషయాలలో తమ సంస్థ తరఫున ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ సదస్సులో ఎస్‌బీఐ ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ వంగా ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు కసరత్తు

- జహీరాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వి.క్రాంతి పేరు సిఫారసు
- ఓటరు నమోదుకు ఈ నెల 22 వరకు గడువు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 9: లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం సంగారెడ్డి జిల్లా యంత్రాంగం ప్రక్రియ మొదలుపెట్టింది. జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి నియామకం కానున్నారు. అలాగే సహాయ రిటర్నింగ్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేరును జిల్లా యంత్రాంగం కేంద్ర ఎన్నికల సంఘానికి సిఫారసు చేసింది. సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్ వి.క్రాంతి, ఉప ఎన్నికల అధికారిగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి కొనసాగనున్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ఓటు హక్కు పొందడానికి అర్హులైనవారు ఈ నెల 22వ తేదీలోగా నమోదు చేసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. అలాగే ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉన్నా ఈ నెల 22లోగానే దరఖాస్తులు అందజేయాలని యంత్రాంగం పేర్కొన్నది. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. కాగా పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ మొదలవడానికి వారం రోజుల ముందు వరకు అర్హులైన వారెవరైనా మిగిలి ఉంటే ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని యంత్రాంగం తెలిపింది. ఇలాంటి ఓటర్ల వివరాలను తుది ఓటరు జాబితాకు అనుబంధ జాబితాను ఇవ్వనున్నామని యంత్రాంగం పేర్కొన్నది.

ఎమ్మెల్యేలు కొబ్బరికాయ కొట్టక..
ఆర్నెళ్లుగా పెండింగ్!

ఎమ్మెల్యేలు సమయమివ్వక ఆగిన 9 ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణం

సంగారెడ్డి జిల్లాలో 246 హెల్త్ సబ్ సెంటర్లు
124 నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు
ఒక్కో భవనానికి రూ. 20 లక్షలు
గతేడాది జూలై 10న పరిపాలనా అనుమతులు
తమకు కేటాయించిన భవనాల నిర్మాణానికి సిద్ధమైన టీఎస్ఎంఎస్ఐడీసీ
ఎమ్మెల్యేలచే ప్రారంభించాలని అప్పటి కలెక్టర్ ఆదేశం
సమయమివ్వని శాసనసభ్యులు.. పెండింగ్‌లోనే నిర్మాణాలు
పీఆర్ ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించిన 81 భవనాలు, డీఆర్‌డీఏకు కేటాయించిన 34 భవనాలూ పెండింగ్‌లోనే


సంగారెడ్డి పట్టణ పరిధిలోని రాజంపేటలో నిలిచిపోయి ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 9 : ఎమ్మెల్యే వచ్చి కొబ్బరికాయలు కొడితేనే పనులు ప్రారంభించాలి.. ఎన్ని రోజులైనా అప్పటి దాకా ఆగాల్సిందే.. ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలపై గత కలెక్టర్ హుకూం ఇది! దీంతో ఆర్నెళ్లుగా జిల్లాలో ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణం మొదలు కాలేదు. పలు చోట్ల పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లే దొరకలేదు. కారణం ఆరా తీస్తే ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలను మంజూరు చేశారే తప్ప నిధులు విడుదల చేయలేదని తెలిసింది.

124 పక్కా భవనాలు

సంగారెడ్డి జిల్లాలోని 246 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ఇందులో 124 కేంద్రాలకు పక్కా భవనాలను మంజూరు చేస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ గతేడాది మే 31న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా 124 ఆరోగ్య ఉప కేంద్రాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తూ అప్పటి జిల్లా కలెక్టర్ శరత్ గత జూలై 10న పాలనాపరమైన అనుమతి ఇచ్చారు. అదే రోజు భవనాల నిర్మాణ బాధ్యతలు వివిధ ప్రభుత్వ ఏజెన్సీలకు కేటాయించారు. ఇందులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి 81 ఆరోగ్య కేంద్రాలు, టీఎస్ఎంఎస్ఐడీసీకి తొమ్మిది, డీఆర్‌డీఏకు 34 ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణాలున్నాయి. టీఎస్ఎంఎస్ఐడీసీ తమకు కేటాయించిన ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల నిర్మాణాలను చేపట్టేందుకు సిద్ధమైంది. నామినేషన్ పద్ధతిన కాంట్రాక్టర్లకు కూడా అనుమతి ఇచ్చింది. ఇదే విషయాన్ని అప్పట్లోనే గత కలెక్టర్ శరత్ దృష్టికి టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు తీసుకెళ్లారు. అయితే ఎమ్మెల్యేలు వచ్చి కొబ్బరికాయలు కొట్టిన తర్వాతే పనులు ప్రారంభించాలని కలెక్టర్ స్పష్టం చేసినట్టు తెలిసింది. ఇందుకుగాను ఎమ్మెల్యేల సమయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్నెళ్లుగా టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు ఎన్నిసార్లు ఎమ్మెల్యేల సమయం కోసం ప్రయత్నించినా వారు రాలేదు. అప్పట్లో జిల్లాలోని ఐదుగురు ఎమ్మెల్యేల్లో నలుగురు బీఆర్ఎస్, ఒకరు కాంగ్రెస్‌కు చెందినవారున్నారు. ఎమ్మెల్యేలు సమయం ఇవ్వకపోవడంతో తొమ్మిది ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలను ఇప్పటి వరకు చేపట్టలేదు.

నిధులు లేక అటకెక్కిన పనులు

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించిన 81 ఆరోగ్య ఉప కేంద్రాల్లో 68 కేంద్రాల భవనాల నిర్మాణాలను ప్రారంభించినా.. కాంట్రాక్టర్లు మధ్యలోనే ఆపేశారు. మిగిలిన 13 ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణాలను అసలు ప్రారంభించనే లేదు. వీటికి డబ్బులు లేవన్న కారణంతో టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. నిధుల కోసం డీఎంహెచ్‌వోకు లేఖ రాసినా స్పందన లేదని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అలాగే, డీఆర్‌డీఏకు కేటాయించిన 34 ఆరోగ్య ఉప కేంద్రాలను స్వయం సహాయక సంఘాలకు కేటాయించారు. ఏడు కేంద్రాల భవనాల నిర్మాణాలను ప్రారంభించారు. 27 కేంద్రాలకు భవన నిర్మాణాలను మొదలు పెట్టనేలేదు. వీటి పనులు ప్రారంభించాలని ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షల చొప్పున స్వయం సహాయక కేంద్రాలకు అడ్వాన్సుగా కలెక్టర్ విడుదల చేశారు. అయినా మిగిలిన డబ్బుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని నిర్మాణాలను మొదలుపెట్టేందుకు స్వయం సహాయక సంఘాలు ముందుకు రావడం లేదు.

30 శాతం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు

- మున్సిపాలిటీల్లో వేగంగా కొనసాగుతున్న ప్రక్రియ
- మార్గదర్శకాల కోసం అధికారుల ఎదురుచూపులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 9: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో వేగంగా సాగుతున్నది. ఆరు గ్యారంటీ పథకాల కోసం జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 25,447 దరఖాస్తులు వచ్చాయి. మెదక్ మున్సిపల్ పరిధిలో 10,890, నర్సాపూర్ పరిధిలో 4,409, తూప్రాన్‌లో 5,256, రామాయంపేట మున్సిపల్ పరిధిలో 4,892 మంది వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో నమోదు చేయడం ప్రారంభించారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఈ నెల 17 వరకు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉన్న సిబ్బంది, కంప్యూటర్లతో ఇప్పటికే పనులు ప్రారంభించారు. అవసరమైనచోట ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఉన్న కంప్యూటర్లతో ప్రైవేటు సిబ్బందితో దరఖాస్తులను ఎంట్రీ చేయిస్తున్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ల పనితీరును జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నది. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రమేశ్ మండలాల్లో పర్యటించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకుంటున్నారు. దరఖాస్తుదారుడి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకాగానే సంబంధిత వ్యక్తి సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపుతున్నారు.

పరిశీలించిన అదనపు కలెక్టర్

తూప్రాన్/వెల్దుర్తి/చేగుంట, జనవరి 9: మెదక్ జిల్లాలో ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ఇప్పటి వరకు 30 శాతం పూర్తయినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ పేర్కొన్నారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం, వెల్దుర్తి, చేగుంట మండల పరిషత్ కార్యాలయాల్లో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. దరఖాస్తుల నమోదు ఈ నెల 17 నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. మరింత వేగంగా డాటా ఎంట్రీ చేయాలని, అవసరమైతే 24 గంటలు నిరంతరాయంగా ప్రక్రియను కొనసాగించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తూప్రాన్‌లో మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహిజుద్దీన్ మేనేజర్ రఘువరన్, ఆర్ఐ రమేష్, వెల్దుర్తి మండలంలో ఎంపీవో విఘ్నేశ్వర్, చేగుంటలో తహసీల్దార్ గియాఉన్నిసాబేగం, ఎంపీవో హనుమంతరావు, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మార్గదర్శకాలు వచ్చాకే..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 17 వరకు నాలుగు మున్సిపాలిటీల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దరఖాస్తుల్లోని వివరాల ఆధారంగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే పింఛన్లు, రైతుబంధు వస్తున్నవారు కొత్తగా దరఖాస్తు చేసుకోవద్దని.. ప్రస్తుతం ఉన్నవే కొనసాగిస్తామని స్పష్టం చేయడంతో ఈ రెండింటిని మినహాయించి మిగిలిన గ్యారంటీలకు వచ్చిన దరఖాస్తులను వార్డులవారీగా విచారణ చేయనున్నట్లు తెలిసింది. మరోవైపు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రానందున సర్కారు నిర్ణయం మేరకే తదుపరి కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం, వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రమేష్


పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలి
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ
- సమీక్షలో మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 9: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, మెదక్ జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో పది విద్యార్థుల పరీక్షల సన్నద్ధత, బోధన తదితర అంశాలపై మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చిలో జరగబోయే పది పరీక్షలకు జిల్లా నుంచి 10,300 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి సబ్జెక్టు టీచర్లు కృషి చేయాలని ఆదేశించారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. ప్రతీ పాఠశాలలో 'లక్ష్య' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించాలని, వారివారి అభ్యసనా సామర్థ్యాలను అనుసరించి విద్యా బోధన చేయాలని నిర్దేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డీఈవో రాధాకిషన్ మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతీ పాఠశాలలో రెండు పూటలా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం తొలి మెట్టు, ఉన్నతి కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులు తరగతి కార్యకలాపాలపై సంకలనం చేసిన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అధికారులు విజయలక్ష్మి, శంకర్, జమ్లనాయక్, రవిప్రసాద్, గోవింద్, కృష్ణయ్య, సుదర్శనమూర్తి, నీలకంఠం, బుచయ్యనాయక్, డీఎస్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమీక్షకు హాజరైన మండల ప్రత్యేకాధికారులు, సంక్షేమాధికారులు

ఔరా.. బుల్లి శాస్త్రవేత్తలు

- అబ్బురపరుస్తున్న 'బాల వైజ్ఞానిక్ ప్రదర్శిని'
- జిల్లా నలుమూలల నుంచి 761 ఎగ్జిబిట్లు
- ఆలోచింపజేసేలా విద్యార్థుల నమూనాలు
- నేటితో ముగియనున్న సంగారెడ్డి జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్


విద్యార్థులు ప్రదర్శించిన సోలార్ ఎగ్జిబిట్

సంగారెడ్డి అర్బన్, జనవరి 9: పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక్ ప్రదర్శిని(2023-24) అబ్బురపరుస్తున్నది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనకు సంగారెడ్డి శాంతి నగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ వేదికైంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి తీసుకొచ్చిన 761 ఎగ్జిబిట్లను ఈ సారి ప్రదర్శించారు. అందులో మికోన్నత పాఠశాలలు 101 ఉండగా, ఉన్నత పాఠశాలలు 657 ఉన్నాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ అనే ప్రధాన అంశంపై నిర్వహిస్తున్న ఈ సైన్స్ ఫెయిర్ ఎంతో మందిని ఆలోచింపజేస్తున్నది. ఈ నెల 8 వ తేదీన ప్రారంభమైన బాల వైజ్ఞానిక్ ప్రదర్శిని నేటి(బుధవారం)తో ముగియనున్నది. రాష్ట్రంలో అన్ని జిల్లాలో జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన వర్చువల్‌గా నిర్వహిస్తుండగా, ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే మాన్యువల్‌గా నిర్వహించడం విశేషం. విద్యార్థులు తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి వివిధ రకాల ఎగ్జిబిట్లను ప్రదర్శింపజేశారు. అందులో కొన్ని ఇలా ఉన్నాయి.

యూటర్న్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు..



రోడ్డు మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. 'యూ'టర్నింగ్ వద్ద రోడ్డు ప్రమాదాలను నివారించే విధంగా జోగిపేట మహాత్మాజ్యోతిబాపూలే స్కూల్ విద్యార్థులు ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న క్రమంలో అకస్మాత్తుగా మలుపు వచ్చినపుడు కొద్ది దూరంలో స్పీడ్ బ్రేకర్ వేయాలి. స్పీడ్ బ్రేకర్‌కు వాహన టైర్ తాకగానే వాహనం ఎటువెళ్లాలో ఆ మలుపు దిశలో(రైట్-లెఫ్ట్) సిగ్నల్ లైట్లు వెలగడంతో పాటు పెద్ద శబ్దం వస్తుంది. అలాంటప్పుడు అటుగా ఎదురుగా వస్తున్న వాహన డ్రైవర్ అప్రమత్తమై వేగం తగ్గించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు.

జోగిపేట మహాత్మాజ్యోతిబాపూలే విద్యాలయ విద్యార్థులు జగదీశ్వరి, నిహారిక, గైడ్ టీచర్ పుష్పలత సహాయంతో రూపొందించిన నమూనా

స్తంభం ఎక్కకుండానే వీధి దీపాల రిపేర్

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న లైన్‌మెన్‌లు చాల కష్టపడుతుంటారు. వీధి దీపాలు మార్చడం, రిపేర్స్ వచ్చినప్పుడు స్తంభం ఎక్కి రిపేర్ చేయాల్సి వచ్చేది. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతుండేవి. కొన్ని సందర్భాల్లో క్రేన్‌లు తెచ్చి రిపేర్లు చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో కరెంటు స్తంభం ఎక్కకుండా రిపేర్ చేయడానికి వీలుగా విద్యార్థిని లిఖిత ఎగ్జిబిట్‌ను రూపొందించారు. ఐరన్‌పోల్స్‌కి ఉండే స్ప్రు ద్వారా పోల్‌ను కిందకు వంచి రిపేరైన తర్వాత యథావిధిగా ఫిట్ చేస్తారు. దీంతో లైన్‌మెన్‌కి పనిచేయడం సులభమవుతుంది.


గుమ్మడిదల జడ్పీహెచ్ఎస్‌లో 6వ తరగతి విద్యార్థిని లిఖిత, గైడ్ టీచర్ పి.శోభారాణి సహాయంతో రూపొందించిన పరికరం

పంటల రక్షణకు ఎయిర్ గన్


అటవీ జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయదారులు ఎంతో కష్టపడుతుంటారు. ఈ శ్రమ నుంచి తప్పించుకునేలా ఓ ఎగ్జిబిట్‌ను పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నేహ, భువనకృతి రూపొందించారు. ప్లాస్టిక్ పైపును రెండు అడుగుల పొడవులో గన్ మాదిరిగా తయారుచేసి ఓ పైపు చివరి కొన వద్ద రంధ్రం చేసి గొట్టం అమర్చాలి. ఆ గొట్టం పైభాగం నుంచి క్యాల్షియం కార్బైడ్ పౌడర్, నీరు వేసి మూత మూసేయడంతో ఎసిటలిన్ గ్యాస్ వాయువు వెలువడుతుంది. అపుడు పైప మరో వైపు నుంచి 30 సెకన్లకు ఒక సారి లైటర్ వెలిగిస్తే పెద్ద శబ్దం వస్తుంది. ఆ శబ్దానికి అడవి పందులు, పక్షులు, కోతులు పంటల వైపు రాకుండా ఉంటాయి.


పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నేహ, భువనకృతి గైడ్ టీచర్లు మదన్‌గోపాల్, రాములు సహాయంతో తయారు చేసిన జంతువులను తరిమే ఎయిర్‌గన్

కాలుష్యం తగ్గించేలా..

వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు విద్యార్థులు అద్భుతమైన ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. పరిశ్రమలు, వాహనాలు నుంచి వెలువడే కాలుష్యంతో పాటు పంటలకు కృత్రిమ రసాయనాలను వాడటం వల్ల రోజురోజుకూ గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోతున్నది. వాటి వల్ల వెలువడే విషవాయువులతో వాతావరణం వేడెక్కుతున్నది. ఈ నేపథ్యంలో కాలుష్యకారక వాహనాల నుంచి వెలువడే పొగను శుద్ధి చేసిన అనంతరం బయటకు పంపాలని, అందుకు మొక్కలు ఎక్కువగా నాటాలని, వీలైనంత వరకు శీతలీకరణ పరికరాలను తక్కువగా వాడాలని చెప్పేలా దిగ్వాల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి విజయలక్ష్మి రూపొందించారు.


ఎగ్జిబిట్‌తో దిగ్వాల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి విజయలక్ష్మి, గైడ్ టీచర్ మమత







గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

జహీరాబాద్, జనవరి 9: జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ క్రిష్ణవేణీని విధుల నుంచి తప్పిస్తు సాంఘీక సంక్షేమశాఖ గురుకులాల కార్యదర్శి డా.నవీన్ నికోలస్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ కళాశాలలో మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని స్వప్న ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మెదక్ రీజియన్ ఆర్సీవో భీమయ్య విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడంతో అన్ని వివరాలను పరిశీలించిన గురుకులాల కార్యదర్శి డా.నవీన్ నికోలస్ ఆమెను విధుల నుంచి తప్పిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. కళాశాలలో సీనియర్ అధికారికి ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించారని కళాశాల సిబ్బంది తెలిపారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 9: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మైత్రీమైదానంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను, విద్యాసంస్థల ప్రతినిధులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదేశించారు. ఎమ్మెల్యే మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొనే విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. విజేతలకు తాను సొంతంగా నగదు పురస్కారాలను అందజేస్తానన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తహసిల్దార్ భాస్కర్, ఎంఈవో రాథోడ్, ప్రధానోపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం నిధులిస్తాం

మనోరాబాద్ డిసెంబరు 9: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం జెడ్పీ నిధుల నుంచి రూ. 15 లక్షల మంజూరు చేస్తానాన్ని జెడ్పీచైర్‌పర్సన్ హేమాలత శేఖర్‌గౌడ్ హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని చెట్లగౌరారం గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదని గ్రామస్థులు ఆమె దృష్టికి తీసుకురావడంతో ఆమె స్పందించారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ మధుకర్, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లు జాగ్రత్త

చిలప్‌చెడ్, జనవరి, 9: వరినాట్లు వేసిన పొలాల పట్ల రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏవో బాల్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని అంతారం గ్రామంలో వరినాట్లు వేసిన పంట పొలాలను మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణం చల్లగా ఉన్న కారణంగా వరినాటు వేసిన పొలాల్లో అప్పుడప్పుడు నీరు తీసివేస్తుండాలన్నారు. తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు.

187 కొత్త బస్సులకు ప్రతిపాదనలు

నారాయణఖేడ్, జనవరి 9: మెదక్ ఆర్టీసీ రీజినల్ పరిధిలో 187 కొత్త బస్సుల కోసం ప్రతిపాదనలు పంపామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. ఖేడ్‌ను మంగళవారం సందర్శించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రీజినల్ పరిధిలో 557 బస్సులు ఉన్నాయన్నారు. రీజియన్ పరిధిలో 49 ఆర్టీసీ స్థలాల్లో షటర్లు నిర్మించి ఈ టెండరు ద్వారా లీజుకు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమె వెంట ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, పీఆర్వో పాండు, నెహ్రూనాయక్, తదితరులు ఉన్నారు.

లావుణి పట్టా భూముల్లో క్రషర్లు నడపొద్దు

కంది, జనవరి 9 : కంది మండలంలోని ఎర్దనూర్ శివారులో పేదలకు చెందిన లావుణి పట్టా భూముల్లో ఏర్పాటు చేసిన క్రషర్లను ఆయా శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. క్రషర్లను తొలగించాలని గ్రామస్థులు ఆర్డీవోకు ఫిర్యాదు చేయడంతో అధికారులు క్రషర్లను పరిశీలించారు. క్రషర్లను తొలగించాలని నిర్వాహకులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రషర్లను పరిశీలించిన వారిలో ఆర్ఐ వెంకట్‌రాం రెడ్డి, ఇరిగేషన్ ఏఈ మజార్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

పెద్దశంకరంపేట, జనవరి 9: కేంద్రప్రభుత్వ పథకాలపై వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా మంగళవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని జూకల్‌గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి మండల పరిధిలోని ఆయా శాఖల అధికారులు ప్రజలకు వివరించారు.



సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలి

● సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు


విద్యార్థి లోహిత్‌యాదవ్‌ను అభినందిస్తున్న గీత స్కూల్ యాజమాన్యం

మనోహరాబాద్, జనవరి 9: జనగామ పట్టణ పరిధిలో ఈనెల 12 నుంచి 14 వరకు జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు సూచించారు. మనోహరాబాద్ మండలంలోని క్రీడా ప్రాంగణంలో వారంరోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్‌శర్మ, కోశాధికారి గోవర్దన్‌గౌడ్, ఎస్‌ఐ హరీశ్‌గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గీత స్కూల్ విద్యార్థి

తూప్రాన్, జనవరి 9: తూప్రాన్ గీత స్కూల్ విద్యార్థి నరాల లోహిత్‌యాదవ్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకట కృష్ణారావు తెలిపారు. ఈనెల 10న రాజస్థాన్ రాష్ట్రం బికనీర్‌లో జరిగే సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలుర విభాగంలో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. లోహిత్‌యాదవ్‌ను కరస్పాండెంట్ పీ.రామాంజనేయులు, చైర్‌పర్సన్ పీ.ఉష, డైరెక్టర్లు బీ.రాఘవేందర్‌గౌడ్, కే.నారాయణగుప్తా, పీఈటీలు శైలేందర్, కరుణాకర్ అభినందించారు.

తల్లి పాల నిల్వ కేంద్రం ప్రారంభం ఎప్పుడో?

● ఎంసీహెచ్‌లో ప్రారంభానికి నోచుకోని మదర్ మిల్క్ బ్యాంకు
● పనులు పూర్తై ఆరునెలలైనా అందుబాటులోకి రాని వైనం
● కేంద్రం ఏర్పాటుపై తల్లుల ఎదురుచూపులు
● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి 'దామోదర్' దృష్టిసారిస్తే మేలు




సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం, సంగారెడ్డి ఎంసీహెచ్‌లో ప్రారంభానికి నోచుకోని తల్లి పాల నిల్వ కేంద్రం

సంగారెడ్డి అర్బన్, జనవరి 9: సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయతలపెట్టిన తల్లి పాల నిల్వ కేంద్రం(ల్యాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్) ప్రారంభానికి నోచుకోవడం లేదు. పనులు పూర్తై, పరికరాలు చేరుకుని ఆరునెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఆరంభానికి కార్యరూపం దాల్చలేదు. మాతా శిశుఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) లోని మొదటి అంతస్తులో మదర్ మిల్క్ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రూ.3 లక్షల నిధులతో ఫర్నిచర్ పార్టీషన్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ తదితర ఆధునీకరణ పనులు పూర్తిచేశారు. రూ.9.59 లక్షల నిధులతో తల్లి పాల నిల్వకు సంబంధించిన పరికరాలను సమకూర్చారు. టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో పనులు చేపట్టగా, ప్రారంభోత్సవానికి మాత్రం జిల్లా యంత్రాంగం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తారా? లేక కలగానే మిగిలిపోనుందా అన్న చర్చ సర్వత్రా జరుగుతున్నది.

తల్లీ, బిడ్డల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చిన అప్పటి సర్కారు తల్లి పాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అత్యవసర పరిస్థితులలో తల్లి పాల కొరతను తీర్చేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే తల్లీ, బిడ్డల క్షేమం కోసం ఎంసీహెచ్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మఒడి వంటి పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే శిశువులకు పాల సమస్యను దూరం చేసేందుకు తల్లి పాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా తల్లుల్లో జన్యుపరమైన లోపాలు, ఒత్తిడి, వయస్సు ఎక్కువగా ఉన్నవారికి తల్లి పాలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. బరువు తక్కువగా పుట్టిన శిశువులు, నెలలు నిండకుండా జన్మించిన పిల్లలకు, తల్లి పాలు అందని శిశువులకు వీటిని ఉపయోగిస్తారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న తల్లి పాల బ్యాంకుతో నవజాత శిశువులకు మరింత భరోసా దక్కనున్నది. పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఎంసీహెచ్‌లో ప్రసవమైన తల్లుల నుంచి వారి సమ్మతితోనే పాలను సేకరిస్తారు. శిశువు చనిపోయిన బాలింతలు, స్వచ్ఛందంగా వచ్చిన తల్లుల నుంచి పాలను సేకరించి వాటిని తల్లి పాల బ్యాంకులో భద్రపరుస్తారు. ఆధునిక పరికరాలు, సౌకర్యాలతో నిర్దిష్ట డిగ్రీల దగ్గర భద్రపర్చి, శుద్ధి చేసి అవసరమైన శిశువులకు అందిస్తారు. డెలివరీ సమయంలో ఉమ్మనీరు మింగడం, బరువు తక్కువగా పుట్టినవారు, పుట్టగానే ఏడవనివారు, ఇన్‌ఫెక్షన్ సోకిన వారికి ఈ పాలతో ఎంతో ప్రయోజనం కలుగనున్నది. తల్లి పాల సమస్యతో ఇబ్బందులు పడే బాలింతలు ఈ కేంద్రం ద్వారా ఉచితంగా తల్లి పాలు పొందవచ్చు. ఈ క్రమంలో తల్లి పాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు ఎదురుచూపులు తప్పడం లేదు. కావున తల్లి పాల నిల్వ కేంద్రం అందుబాటులో తెచ్చేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవ చూపాలని తల్లులు కోరుతున్నారు.

చిట్కుల్ ఎల్లమ్మ ఆలయంలో చోరీ


ఆలయంలో పరిశీలిస్తున్న పోలీసులు

చిలప్‌చెడ్, జనవరి 9: చిట్కుల్ గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం ఉదయం 9 గంటలకు పూజలు చేసేందుకు పూజారి జానమొల్ల పరశురాంగౌడ్ వెళ్లగా.. గుడి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా 4 కిలోల ఇత్తడి ఎల్లమ్మ, జమదగ్ని విగ్రహాలు, అమ్మవారి వెండి కండ్లు, హుండీలోని డబ్బులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మిస్బాఉద్దీన్ పేర్కొన్నారు.

సవాళ్లను ఎదుర్కొంటూ భారత్ అభివృద్ధి

● ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలి
● వోక్సన్ విశ్వవిద్యాలయ అంతర్జాతీయ సదస్సులో బెల్జియం మాజీ ప్రధాని వైవెస్ లెటెర్మీ



పలువురు ప్రతినిధులతో బెల్జియం మాజీ ప్రధాని వైవెస్ లెటెర్మీ

కోహీర్, జనవరి 9: భారత్-యూరోపియన్ యూనియన్ ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలని బెల్జియం మాజీ ప్రధాని వైవెస్ లెటెర్మీ అన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామ పరిధిలోగల వోక్సన్ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'భవిష్యత్తులో ఉన్నత విద్యను వ్యూహాత్మకంగా ప్రోత్సహించడం ఎలా' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు. భారత్-యూరోపియన్ యూనియన్ దేశాలు విలువలతో కూడిన ప్రజాస్వామ్య దేశాలు కనుక వీటి మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలన్నారు. ఉన్నత విద్య, వ్యాపార రవాణా, తదితర అంశాలలో ద్వైపాక్షిక సంబంధం మెరుగుపడినప్పుడే ఇరుదేశాల అభివృద్ధి రాబోయేరోజుల్లో సాధ్యమవుతుందని చెప్పారు. ప్రపంచ దేశాల సవాళ్లను ఎదుర్కొంటూ భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. భారత దేశంలో వివిధ రంగాల్లో ఉన్న ఔత్సాహికులకు మంచి ప్రోత్సాహం ఉన్నదని పేర్కొన్నారు. అంతేకాకుండా భారత్‌లో బహుళజాతి సంస్థల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. భవిష్యత్‌తరాలలో ఉన్నత విద్యను మెరుగుపరచడానికి భారత్-యూరోపియన్ యూనియన్ దేశాలు భాగస్వాములు కావాలన్నారు. రాబోయేరోజుల్లో ఉన్నత విద్యను మెరుగుపరచాలన్న ఆలోచనపై వోక్సన్ విశ్వవిద్యాలయ యాజమాన్యం ఈ సమావేశాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలోచనాపరులు, విధాన నిర్ణేతలు, పరిశ్రమల ప్రతినిధులను ఒకచోట చేర్చడమే అంతర్జాతీయ సమావేశం ప్రాథమిక లక్ష్యమన్నారు. అనంతరం వోక్సన్ విశ్వవిద్యాలయం అవార్డును అందుకున్నారు. డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ కో చైర్మన్, బెల్జియం గౌరవ కాన్సుల్ జనరల్ జీవీ.ప్రసాద్, ఏఐసీటీఈ మాజీ చైర్మన్, డాక్టర్ శంకర్ ఎస్.మంథా, వోక్సన్ యూనివర్సిటీ సీఈవో విశాల్ ఖుర్మా పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

● సంగారెడ్డి డీఎస్పీ జే.రమేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కుమార్

సంగారెడ్డి క్రైం, జనవరి 9: కంపెనీలలో పనిచేస్తున్న వారికి గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సంగారెడ్డి డీఎస్పీ జే.రమేష్‌కుమార్ తెలిపారు. సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. పుల్కల్ మండలం మిన్పూర్‌కు చెందిన జెరువుల శ్రీను(46), పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన వడ్డె అశోక్(38), మిన్పూర్‌కు చెందిన రమావత్ అనిల్ జహీరాబాద్ మండలం మల్చెల్మతండాకు చెందిన బానోత్ శ్రీను, నాగిల్‌గిద్ద మండలం మాచేపల్లితండాకు చెందిన రాథోడ్ రవీందర్, గైరాన్‌తండాకు చెందిన రాథోడ్ హరి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన మోహన్, మిన్పూర్‌కు చెందిన బేగరి నర్సింహులు కలిసి ఒరిస్సా, భద్రాచలం, ఆంధ్రా సరిహద్దు నుంచి గంజాయి తీసుకొచ్చి జహీరాబాద్, ఇస్నాపూర్, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లోని కంపెనీల్లో పనిచేస్తున్న వారికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం జెరువుల శ్రీను, వడ్డె అశోక్‌లు సంగారెడ్డి వైపు గంజాయి విక్రయించేందుకు వస్తున్నారన్న సమాచారం మేరకు పట్టణ పోలీసులు వారిని పట్టుకోగా 600 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. వీరితో పాటు బానోత్ శ్రీను, రాథోడ్ రవీందర్‌లను అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు చెప్పారు. పరారీలో ఉన్న మరో నలుగురు నిందితుల కోసం నాలుగు బృందాలుగా గాలిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు ఎస్.శ్రీధర్‌రెడ్డి, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ వాసి మృతి

తూప్రాన్, జనవరి 9: అతివేగంగా వచ్చిన వాహనం ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్లకు చెందిన రాజశేఖర్(28) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. మంగళవారం పని మీద రాజశేఖర్, షేక్ జానీలు ద్విచక్ర వాహనంపై మాసాయిపేట మండలంలోని కంపెనీకి వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద 44వ జాతీయ రహదారిపై వెనుకగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున రాజశేఖర్ కిందపడగా, తలమీదుగా వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న షేక్ జానీ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడు రాజశేఖర్‌కు నాలుగు నెలల క్రితమే వివాహం జరిగినట్లు తెలిసింది. మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

కల్వర్టును ఢీకొట్టిన కారు, ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు


మృతిచెందిన అస్లాం

బెజ్జంకి, జనవరి 9: కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. జగిత్యాల జిల్లా ఇస్లాంపూరకు చెందిన మహ్మద్ అస్లాం(29) మంగళవారం శంషాబాద్ విమానాశ్రయానికి కారులో వెళ్లి వస్తున్నాడు. బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారి పక్కన ఉన్న కల్వర్టును కారు ఢీకొట్టింది. అస్లాం అక్కడికక్కడే మృతిచెందగా.. కారులో ప్రయాణిస్తున్న పాషా, సోయల్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మోయిజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శంకర్‌రావు తెలిపారు.

మొబైల్ ఫోన్ పేలి గాయపడిన యువకుడి మృతి

తూప్రాన్, జనవరి 9: మొబైల్ ఫోన్ పేలి గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మహారాష్ట్రలోని బండారా జిల్లా ఆలేసూర్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ బడిరాం ఇన్వాతి, సునీల్ మహదేవ్ ఖండలే(30), దుర్గేష్, రాజ్‌కుమార్, అశోక్, దీపక్ సుదాపర్గెర్‌లు తూప్రాన్ మండలం ఘనపూర్ శివారులోని శివం శంకరం క్రషర్‌లో పనిచేసేందుకు వచ్చారు. సోమవారం పనులు ముగించుకుని సాయంత్రం 6 గంటలకు కూరగాయలు తెచ్చుకోవడానికి క్రషర్ నుంచి ఘనపూర్ గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యలో సునీల్ మహదేవ్ ఖండలే మొబైల్ ఫోన్ తీసి టార్చ్ లైట్ వేస్తుండగా ఒక్కసారిగా పేలిపోయిందని వివరించారు. ప్రమాదంలో సునీల్ కుడివైపు పొట్టలో నుంచి పేగులు బయటకు వచ్చాయి. వెంటనే అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందినట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరించారు. మృతుడి బావమరిది జ్ఞానేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

జక్కాపూర్ విద్యార్థినికి మాచిరాజు బాలసాహిత్య పురస్కారం


భువనేశ్వరి

నారాయణరావుపేట, జనవరి 9: హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాలసాహిత్య పీఠం ప్రకటించిన బాలసాహిత్య పురస్కారానికి నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని దుబ్బాక భువనేశ్వరి ఎంపికైనదని ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షౌకత్ అలీ మంగళవారం తెలిపారు. మాచిరాజు బాలసాహిత్య పీఠం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తమ కథలు రాసిన 20 మంది బాలలను ఎంపిక చేసిందని, భువనేశ్వరి రాసిన 'నమ్మిన వారికి ద్రోహం చేయకు' అనే కథకు పురస్కారం లభించిందని చెప్పారు. ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న సమావేశంలో పురస్కారం అందిస్తారని తెలిపారు. విద్యార్థిని భువనేశ్వరిని, ప్రోత్సహించిన ఉపాధ్యాయులు భైతి దుర్గయ్యను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, జిల్లాకు చెందిన సాహిత్యవేత్తలు అభినందించారు.

బైక్‌ల దొంగ అరెస్టు

● నాలుగు బైక్‌లు, 26 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

మెదక్ అర్బన్, జనవరి 9: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బైక్‌లను, గ్యాస్ సిలిండర్లను చోరీ చేసే ఘరానా దొంగను అరెస్టు చేసినట్లు మెదక్ పట్టణ సీఐ వెంకటేష్ తెలిపారు. మెదక్ పోలీసులు బోధన్ చౌరస్తాలో సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఓ వ్యక్తి బైక్‌పై సిలిండర్ తీసుకొని వెళ్తుండగా.. వాహనపత్రాలు అడిగారు. స్పందన లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా.. దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడు. నవంబరు, డిసెంబరు నెలలో మెదక్‌లోని చంద్రభవన్ వెంచర్‌తో పాటు చేగుంట, రామాయంపేట, తూప్రాన్ తదితర ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లు, బైక్‌లు దొంగలించినట్లు తెలిపాడు. అతని వద్ద నుంచి నాలుగు బైక్‌లు, 26 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వెల్లడించారు. కాగా నిందితుడు సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి గ్రామానికి చెందిన మామిడి శ్రీకాంత్ అని వివరించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

శివ్వంపేట, జనవరి 9: కాలకృత్యాలకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. శివ్వంపేట మండలం బోజ్యాతండాకు చెందిన రాములు(65) పింఛన్ కోసం సోమవారం చండి గ్రామానికి వెళ్లాడు. కానీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు మంగళవారం వెతుకుతుండగా చండి గ్రామ సమీపంలోని ఓ చెరువు వద్ద చెప్పులు, టవల్, పింఛన్ బుక్కు కనిపించడంతో అనుమానం వచ్చి వెతకగా.. రాములు మృతదేహం లభ్యమైంది. ఈ విషయం పోలీసులకు తెలపగా వారు వచ్చి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, జనవరి 9: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. కొండాపూర్‌లోని రైతువేదిక వద్ద ఆ మండలానికి చెందిన 50మంది లబ్ధిదారులకు మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం తగ్గించేందుకు గత ప్రభుత్వం ఈ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఎన్నో ఆశలతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి, జడ్పీటీసీ పద్మావతి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, ఎంపీడీవో మధులత పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల నర్సింలు, నాయీబ్రాహ్మణసేవా సంఘం ప్రతినిధులు మాణిక్ ప్రభు, నాగబూషణం, ఆంజనేయులు, శేఖర్, చరణ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి

● పనుల పరిశీలనలో ప్రజల బాధ్యత కూడా ఉండాలి

● కల్హేర్ ఎంపీపీ సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, జనవరి 9: నాసిరకంగా అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని, నాసిరకం పనులను ప్రజలు కూడా పరిశీలించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. కల్హేర్‌లో మంగళవారం ఎంపీపీ గుర్రపు సుశీల అధ్యక్షతన జరిగిన ఎంపీపీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరు గ్యారంటీలను ప్రజాపాలన కార్యక్రమం ద్వారా విడతల వారీగా అమలు చేస్తామని, ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. అధికారులకు తమ పూర్తి సహకారం ఉంటుందని, పని చేయని వారిపై తప్పకుండా చర్యలుంటాయని హెచ్చరించారు. సర్పంచులు చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను పార్టీలకతీతంగా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఖాళీగా ఉన్న పలు శాఖల్లో అధికారులు, సిబ్బంది నియామకానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సమావేశంలో ఎంపీపీ సుశీలఅంజయ్య, జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జడ్పీ కోప్షన్ సభ్యుడు ఎండి అలీ, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీపీ కో ఆప్షన్ సభ్యుడు ఎండి గని, తహసీల్దార్ బాలాశంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏఈలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. కాగా 317 జీఓను రద్దు చేసేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని గోర్‌సేవా నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. 61 సంవత్సరాలు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

దత్తమార్తాండ మందిరంలో ఘనంగా సంగీత కచేరి



పీఠాధిపతి మార్తాండ్ మాణిక్‌ప్రభు మహరాజ్ నుంచి ఆశీస్సులు తీసుకుంటున్న రూరల్ సీఐ వెంకటేష్

ఝరాసంగం, జనవరి 9: మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామంలో గల దత్తమార్తాండ మందిర్ ముక్తాశ్రమంలో సోమవారం రాత్రి మార్తాండ్ మాణిక్‌ప్రభు మహరాజ్ జన్మదినోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక గాయకులు కులకర్ణి సంగీతకచేరిని భక్తులకు వినిపించారు .భక్తులు అధికసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు తీసుకుని పీఠాధిపతి మార్తాండ్ మాణిక్‌ప్రభు మహరాజ్ ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గందరగోళంగా మత్స్య సహకార సంఘం ఎన్నిక

● జిల్లా చీఫ్ ప్రమోటరుగా రాంకిష్టయ్య ఏకగ్రీవం



చీఫ్ ప్రమోటరుగా ఎన్నికైన రాంకిష్టయ్యను సన్మానిస్తున్న డైరెక్టర్లు

మెదక్ అర్బన్, జనవరి 9: జిల్లాల పునర్విభజన తర్వాత తొలిసారి కొత్త జిల్లాలో జిల్లా మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత అడ్‌హక్ కమిటీని నియమించి, అనంతరం పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా జిల్లాల కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో మత్స్య శాఖ అధికారి నరసింహారావు ఆధ్వర్యంలో జిల్లా అడ్‌హక్ కమిటీ ఎన్నికకు సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 280 మత్స్య సహకార సంఘాలు ఉండగా 165 సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. అడ్‌హక్ కమిటీ సభ్యుల ఎన్నికల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. కొంతమంది అధ్యక్షులు తమకు ఎన్నిక సమాచారం ఇవ్వకుండా కమిటీని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా.. కేవలం ఐదారు మంది డైరెక్టర్లతో ఎన్నిక నిర్వహించడాన్ని తప్పు పట్టారు. కొద్దిసేపు సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మత్స్యశాఖ అధికారి కలుగజేసుకొని జిల్లాలోని రెండు, మూడు మండలాలను కలిపి ఒక డైరెక్టర్‌ను ఎన్నుకున్న తర్వాత చీఫ్ ప్రమోటర్ ఎన్నిక నిర్వహిస్తామని చెప్పడంతో శాంతించారు. ఆ తర్వాత మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. చీఫ్ ప్రమోటర్(జిల్లా అధ్యక్షుడు)గా రామాయంపేట మండలం ఝాన్సిలింగాపూర్ గ్రామానికి చెందిన మనేగల్ల రాంకిష్టయ్య ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా అంగని దుర్గేష్, గడప దేవేందర్, అంజయ్య, పెంటయ్య కృష్ణ, బాగయ్య, స్వామి, నర్సింలు, శ్రీనివాస్, కె.బాగయ్య ఎన్నికయ్యారు. మత్స్యశాఖాధికారి మాట్లాడుతూ.. ఈ కమిటీ మూడు నెలల పాటు అధికారికంగా కొనసాగుతుందన్నారు. ఆ తర్వాత నిబంధలన ప్రకారం జిల్లా ఎన్నికలు నిర్వహిస్తారని వెల్లడించారు.

22న ప్రభుత్వ సెలవు ఇవ్వాలి

పెద్దశంకరంపేట: అయోధ్యలో రామాలయం ప్రారంభాన్ని పురస్కరించుకొని జనవరి 22న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ మంగళవారం తెలిపారు. ఉద్యోగులతో పాట ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు 22న సెలవు రోజుగా ప్రకటించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నారాయణఖేడ్/కల్హేర్: ఖేడ్ తహసీల్ గ్రౌండ్, కల్హేర్ మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్‌లో నరేంద్ర మోదీ క్రికెట్ కప్ పోటీలను రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆలె భాస్కర్ మంగళవారం ప్రారంభించారు. గ్రామాల్లో స్నేహపూరిత వాతావరణం కొనసాగాలంటే క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఖేడ్‌లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే.నంగప్ప, బీజేపీ ఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిరాం, పట్నం మాణిక్యం, సతీష్‌కుమార్, రాజు, వెంకట్ పాల్గొన్నారు. మీర్‌ఖాన్‌పేటలో జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిరాం, కల్హేర్ మండలాధ్యక్షుడు అల్లాపురం రాజు, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, బీజేవైఎం అధ్యక్షుడు సతీష్, సంతోష్, నీరుడి వేణు, రవిందర్‌నాయక్, శ్రీకాంత్, రాజుగౌడ్ భూపాల్, యాదగిరి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

వెల్దుర్తి: విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంఈవో యాదగిరి తెలిపారు. వెల్దుర్తి ఎంఈవోగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం యాదగిరిని పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సీతారాములు, ప్రధానోపాధ్యాయులు, పీఆర్టీయూ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఎన్నిక

రామాయంపేట: పట్టణ మున్నూరుకాపు(1) అధ్యక్షుడిగా అల్లాడి వెంటి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గాజుల బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా నక్క చిన్న శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కస్తూరి ఎల్లయ్య, కోశాధికారిగా బాజ రామరాజులతో పాటు నలుగురు సభ్యులు ఎన్నికయ్యారు.

ఇసుక నిల్వల సీజ్

మెదక్ అర్బన్: అక్రమంగా నిల్వ చేసిన 20 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకటేష్ తెలిపారు. పట్టణంలోని వాగులోంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలించి దుర్గాకాలనీలో డంప్ చేసినట్లు తెలిసిందన్నారు. స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి 20 ట్రాక్టర్ల అక్రమ ఇసుకను సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

చేగుంట: రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్ శివారులో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని కాపర్, ఆయిల్‌ను దుండగులు చోరీ చేశారు. సోమవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటుచేసుకోగా.. మంగళవారం గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రంజిత్ ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి, కేసు నమోదు చేశారు.

గొల్లపల్లిలో బోనాల పండుగ

నర్సాపూర్: నర్సాపూర్ మండలం గొల్లపల్లిలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాధమల్లేశ్ గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వీర హనుమాన్ చందనోత్సవం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని భారీ వీర హనుమాన్ విగ్రహానికి మంగళవారం నిర్వహించిన చందనోత్సవంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భక్తులు, సాహితీ ఆస్పత్రి డైరెక్టర్ రాము గురుస్వామి ఆధ్వర్యంలో కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి మండలాల్లో 108 హనుమాన్ విగ్రహాలకు చందనోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని హనుమాన్ విగ్రహానికి రంగులు వేయించారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి



ఝరాసంగం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్‌కుమార్

ఝరాసంగం, జనవరి 9: బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడంతో పాటు, స్థానికంగా ఉండి ప్రజలకు సేవలు అందజేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్‌కుమార్ సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఎస్పీ రఘు, రూరల్ సీఐ వెంకటేషం, ఎస్‌ఐ రాజేందర్ రెడ్డి, ఎస్‌ఐ-2 క్రిష్ణయ్య, సిబ్బంది ఉన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

● పంచాయతీ కార్మికుల డిమాండ్



కూచారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్, డిసెంబరు 9: తమను ఇబ్బందులకు గురిచేస్తున్న కూచారం గ్రామ పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శి తమకు సమయానికి జీతాలు ఇవ్వడం లేదని, ఎంత పని చేసినా చేయడం లేదంటూ మహిళలని చూడకుండా కించపరిచేలా దూషిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న ఎనిమిది కార్మికులకు సంవత్సరం నుంచి ఒక్కటే యూనిఫాం ఇచ్చారని చెప్పారు. అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా పంచాయతీ కార్మికులు తాను చెప్పిన పనులు చేయడం లేదని కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎక్కువ రోజులు విధులకు హాజరు కాకపోవడంతో జీతం తక్కువగా వస్తుందని చెప్పారు.

బీసీ గురుకులంలో అడ్మిషన్లు

నారాయణఖేడ్, జనవరి 9: నారాయణఖేడ్ శివారులోని పెద్ద శంకరంపేట జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వరకు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రేగోడు మోడల్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

● ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

రేగోడు జనవరి 9: రేగోడు మోడల్ పాఠశాలలో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను మండల కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా ప్రారంభించారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో శిక్షణ పొంది ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నారు. రోబోటిక్స్‌తోపాటు సెన్స్, ఆర్ట్స్, లాంగ్వేజెస్, ఒకేషనల్ సబ్జెక్టులకు సంబంధించిన మోడల్స్‌లను విద్యార్థులు ప్రదర్శించారు. 247 మంది విద్యార్థులు 111 మోడల్స్‌లను ఏర్పాటుచేసి ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌ను తహసీల్దార్ బాలలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దిగంబరావ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఫిర్యానాయక్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ దశరథ్, ప్రిన్సిపాల్ జయప్రకాష్, ఖాజా, హెచ్‌ఎం అంజిబాబు సందర్శించారు. ఎగ్జిబిషన్ తిలకించేందుకు నారాయణఖేడ్, రేగోడు మండలాల విద్యార్థులు హాజరయ్యారు. బుధవారం కూడా ఎగ్జిబిషన్ కొనసాగుతుందని ప్రిన్సిపాల్ జయప్రకాష్ తెలిపారు.



ఎగ్జిబిషన్‌లో సైకిల్‌తో తయారు చేసిన వాషింగ్ మిషన్



విద్యార్థినులు ప్రదర్శించిన స్మార్ట్ సిటీ

సీఎంను కలిసిన జిల్లా కాంగ్రెస్ నేతలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రోహిత్, ఆవుల రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

మెదక్/నర్సాపూర్/చేగుంట, జనవరి 9: సీఎం రేవంత్‌రెడ్డిని మెదక్ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాత్రి సీఎంను ఆయన నివాసంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కలిసి, మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శుభాకాంక్షలు తెలిపి, నర్సాపూర్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితితో పాటు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఈ సందర్భంగా రాజిరెడ్డి తెలిపారు. హైదరాబాదులో జరిగిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం అనంతరం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధుల కేటాయింపు, నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సిర్గాపూర్‌లో ఉపాధి హామీ పనులపై ప్రజాదర్బార్

● హాజరైన అదనపు డీఆర్డీవో వామన్‌రావు



సిర్గాపూర్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

కల్హేర్/సిర్గాపూర్, జనవరి 9: సిర్గాపూర్‌లో ఉపాధి హామీ పనులపై మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సంగారెడ్డి జిల్లా అడిషనల్ డీఆర్డీవో వామన్ రావు పాల్గొన్నారు. 2022 మార్చి ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు సిర్గాపూర్ మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన ఈజీఎస్ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో పనుల నిర్వహణ, నిధుల ఖర్చు వివరాలను సిబ్బంది చదివి వినిపించారు. కార్యక్రమంలో సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావ్, అంబుడ్స్‌మన్ భోజిరెడ్డి, పనుల నాణ్యతా అధికారులు అమర్‌నాథ్. సుభాష్, ఎంపీడీవో సుజాత, ఈజీఎస్ ఏపీవో బస్వరాజ్, సామాజిక తనిఖీ డీఆర్పీ రంజిత్, వలంటీర్లు లక్ష్మణ్, సునిత, రాంకుమార్, రాంప్రసాద్, క్షేత్ర సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల వనభోజనం



ఖేడ్‌లో ఆర్టీసీ కార్మికులకు భోజనాలు వడ్డిస్తున్నఆర్‌ఎం ప్రభులత

నారాయణఖేడ్, జనవరి 9: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో ఆవరణలో ఉద్యోగులు, కార్మికులు మంగళవారం వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత హాజరై కార్మికులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి సంస్థ అధికప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు ఆటలపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎం మల్లేశయ్య, అసిస్టెంట్ మేనేజర్ నర్సింలు, మెకానికల్ ఇంజనీర్ దశరత్‌రావు, సూపర్‌వైజర్లు అజీం, కార్మిక నాయకులు నాగయ్య, నెహ్రూ, రాజు, కాశీరాం, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, భాస్కర్ పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో



డిపో ఆవరణలో కుర్చీల పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

జహీరాబాద్: పట్టణంలోని ఆర్టీసీడిపోలో మంగళవారం వనభోజన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. డిపో మేనేజర్ వెంకటసూర్యానారాయణ మాట్లాడుతూ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏటా వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మహిళా ఉద్యోగులు ఆటలపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు డిపో మేనేజర్ బహుమతులను అందజేశారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి ఎస్‌జీటీయూ వినతి




సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేసిన ఎస్‌జీటీయూ నాయకులు

వెల్దుర్తి, జనవరి 9: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశం కోరారు. ఈ మేరకు మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల పరిశుభ్రత కోసం సర్వీస్‌పర్సన్లను నియమించాలని, ప్రతీ గ్రామ పంచాయతీ ఒక ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేయాలని, పాఠశాలలోని ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు, ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. విద్యార్థుల నమోదుతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సీఎంను కలిసిన వారిలో ఎస్‌జీటీయూ రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి అంజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు పోరాటం

కంది, జనవరి 9: రక్షణరంగంలో పనిచేసే ఉద్యోగులకు నష్టం కలిగించేలా ఉన్న కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు పోరాడుతామని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రవీందర్ అన్నారు. దేశవ్యాప్త ఎన్‌జేఏసీ (నేషనల్ జాయింట్ యాక్షన్ కమిటీ) పిలుపులో భాగంగా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని ఫౌండ్రీ గేటు వద్ద మంగళవారం కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలని ఉద్యోగులతో రిలే దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్రం దిగొచ్చేదాక పలు రకాలుగా నిరసనలు తెలుపుతూ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ గణేష్, నాయకులు మల్లికార్జున్, నరేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అంకుష్‌శర్మ, వీరారెడ్డి, నాగభూషన్‌రావు, యాదగిరి, లక్ష్మీనారాయణ, అక్షయ్‌కుమార్, మనికిషన్, భాస్కర్‌రావు యూనియన్ కార్యవర్గ సభ్యులతో పాటు అన్ని యూనియన్ల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలని కోరుతూ కంది ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ వద్ద రిలే దీక్ష చేస్తున్న ఉద్యోగులు

పట్టుదలతోనే లక్ష్య సాధన

● రామకృష్ణ మఠం స్వామిజీ పూజానంద

● ప్రారంభమైన శ్రీ అక్షయ యూత్ ఫెస్ట్



శ్రీ అక్షయ యూత్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న రామకృష్ణ మఠం స్వామిజీ పూజానంద

సంగారెడ్డి అర్బన్, జనవరి 9: ఏకాగ్రత, ఓర్పు, పట్టుదలే లక్ష్య సాధనను సుగమం చేస్తాయని రామకృష్ణ మఠం స్వామిజీ పూజానంద అన్నారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ సమీపంలోని శ్రీ అక్షయ జూనియర్ కళాశాలలో మంగళవారం కళాశాల దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అక్షయ యూత్ ఫెస్ట్-2024ను నిర్వహించారు. హాజరైన పూజానంద మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఆధునిక సాంకేతిక యుగంలో లక్ష్యాలను సాధించే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. స్వామి వివేకానంద బోధనలు అనుసరణీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం మాట్లాడుతూ.. కళాశాలలో ఇంటర్ విద్యతో పాటు వ్యక్తిత్వ నిర్మాణం కోసం వ్యక్తిత్వ వికాసం కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యతో పాటు ఈ ఉత్సవాలలో భాగంగా క్విజ్, క్రీడలు, సెమినార్, టాలెంట్ హంట్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని పరస్కరించుకొని జాతీయ యువజనోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, డైరెక్టర్లు సుధాకర్ జోషి, రాజు గౌడ్, భానుచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే ఇటుక బట్టీలు

● వాయు కాలుష్యంతో ప్రయాణికుల పరేషాన్



జంగంపేట శివారులో రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలు

జిన్నారం, జనవరి 9: జిన్నారం నుంచి అన్నారం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా జంగంపేట శివారు నుంచి ఇటుక బట్టీల నిర్వహణతో వెలువడే పొగ, వాయు కాలుష్యంతో ప్రయాణికులుఉ ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 60 వరకు ఇటుక బట్టీలు ఉండగా.. కొన్ని ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో వాయు కాలుష్యంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బట్టీల్లో ఇటుకలను కాల్చేందుకు ఉపయోగించే కర్రలు, నల్లబొగ్గు, కోల్డ్ యాష్‌లను మండించటంతో పొగ విస్తరించి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. అంతేకాకుండా ఇక ఇటుక తయారీ కోసం చెరువు, కుంటల నుంచి తెచ్చే మట్టి రహదారిపై గుట్టలుగా పడి ప్రమాదాలకు కారణమతున్నది. మట్టి రవాణకు భారీ టిప్పర్‌లను వినియోగించడంతో 3కి.మీ.ల మేర రోడ్డు గుంతల మయంగా మారింది. ఇటుక బట్టీలను దూర ప్రాంతాలకు తరలించడం, రోడ్డు సమీపంలోని ఇటుక బట్టీలకు సేఫ్టీ కవర్‌లు ఏర్పాటు చేసి వాయు కాలుష్యాన్ని నివారించాల్సి ఉన్నది.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించాలి

చిలప్‌చెడ్, జనవరి, 9: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించాలని సెక్టోరియల్ అధికారి సతీష్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంప్లెక్స్‌లో మండలంలోని 34 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఎవరైనా ప్రత్యేక అవసరాలు అనగా గుడ్డి, చెవిటి, మూగ, అంగవైకల్యం గల విద్యార్థులను గుర్తించి యూడైస్ ప్లస్‌లో నేదు చేయాలని సూచించారు. ఈ విధంగా చేయడం వల్ల ప్రభుత్వం నుంచి వారికి సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు.